కమీషన్‌తో 'బఫర్'కు ముడి!

- రూ.లక్షల్లో కమిషన్ బకాయిలు
- ఆందోళనలో మాజీ డీలర్లు



తహసీల్దార్ కార్యాలయం

తాడిపత్రి రూరల్: కమీషన్‌తో బఫర్ స్టాక్‌కు ముడి పెట్టడంతో మాజీ డీలర్లు ఆందోళన చెందుతున్నారు. వివరాలు .. తాడిపత్రి పట్టణంలోని 55 మంది స్టోర్ డీలర్లకు దాదాపు రూ.20 లక్షల కమిషన్ రావాల్సి ఉంది. వీరంతా వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు. వారికి రావాల్సిన కమీషన్ స్టోర్‌లకు కేటాయించిన సీరియల్ నెంబర్ ఖాతాలో ఉంటుంది. స్వతహాగా కమీషన్ డబ్బును డీలర్లు డ్రా చేసుకునే అవకాశం లేదు. బియ్యం తప్ప కేవలం కంది బేడలు, చక్కెర తదితర వాటికి మాత్రమే సర్దుబాటు చేసుకునే అవకాశం ఉంది. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి కేవలం బియ్యం తప్ప మిగిలిన సరుకులు స్టోర్‌లకు రాలేదు. దీంతో ఒక్కో డీలర్‌కు రూ.30 వేల నుంచి రూ. 80 వేల వరకు కమీషన్ రావాల్సి ఉంది. డీలర్ల మార్పు జరుగుతుండటంతో రావాల్సిన కమీషన్ గురించి అధికారులను వైఎస్సార్‌సీపీ మద్దతుదారులైన డీలర్లు అడుగుతున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటి వరకూ డీలర్ల వద్ద ఉన్న బఫర్‌స్టాక్ గురించి అధికారులు ఆరా తీస్తున్నారు. మీకు కమీషన్ కావాలంటే బఫర్ స్టాక్ వివరాలు చెప్పాలంటూ దబాయిస్తున్నారు. అధికారులు కమీషన్‌కు బఫర్‌స్టాక్‌కు ముడిపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. బఫర్ స్టాక్‌కు కమీషన్‌కు ఎక్కువ వ్యత్యాసం ఉండటంతో మాజీ డీలర్లు రావాల్సిన డబ్బు గురించి డిమాండ్ చేస్తున్నారు. కమీషన్ వివాదం కారణంగా కొత్త డీలర్ల నియామకం ఎక్కడ ఆలస్యం జరుగుతుందోనన్న ఆలోచనతో కూటమికి చెందిన ద్వితీయ శ్రేణి నాయకులు రంగంలోకి దిగి మధ్యవర్తిత్యం వహిస్తున్నారు. కమిషన్‌ను ఇచ్చేంత వరకు రాజీనామా చేయమని, తమ వద్ద ఉన్న బయోమెట్రిక్ మిషన్‌కు కొత్త డీలర్లకు ఇవ్వమని భీష్మించుకుంటున్నారు. దీంతో అధికారులు అలాంటి వారి గురించి కూటమి నాయకుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారం చేయాలని సూచిస్తున్నారు..ఎటూ తేల్చుకోలేక తమకు ఉన్నతాధికారులనుంచి ఎలాంటి ఇబ్బందు రాకుండా చూడాలని కోరుతున్నారు.

కొలిక్కివచ్చిన డీలర్ల మార్పు

తాడిపత్రి పట్టణానికి సంబంధించిన రేషన్ డీలర్ల మార్పు కొలిక్కి వచ్చింది. గత నెలలోనే నియోజకవర్గంలోని తాడిపత్రి మండలంలో పాటు పెద్దపప్పూరు,యాడికి, పెద్దవడుగూరు మండలాలకు చెందిన వైఎస్సార్‌సీపీ చెందిన రేషన్ డీలర్ల మార్పు పూర్తి అయింది. కానీ తాడిపత్రి పట్టణానికి చెందిన డీలర్ల మార్పులో జాప్యం జరుగుతూ వచ్చింది. కూటమికి చెందిన పలువురు డీలర్ల పోస్టుల కోసం పోటీ పడ్డారు. గతం నుంచి పార్టీని అంటి పెట్టుకున్న వారితోపాటు ఎన్నికల సమయంలో కూటమిలో చేరిన వారు సైతం పోటీ పడ్డారు. ఎటు తేల్చుకోలేక ఆగస్టు కోటా సరుకులను వైఎస్సార్ పీపీకి చెందిన డీలర్లతో అధికారులు పంపిణీ చేయించారు. చివరికి కూటమి నాయకులు డీలర్ల లిస్టు ఫైనలైజ్ చేసి తహసీల్దార్ కార్యాలయానికి పంపారు. దీంతో పాత డీలర్లకు రెవెన్యూ అధికారులు ఫోన్ చేసి సమాచారం అందించారు. మీ స్థానంలో కొత్త వారిని ఎంపిక చేశారని, డీలర్ పోస్టులను రాజీనామా చేయాలని సూచించారు. రాజీనామా పత్రాలతో కార్యాలయానికి రావాలని కోరారు. అలాగే కొత్తగా ఎంపిక చేసిన వారికి ఫోన్ చేసి అవసరమైన డాక్యుమెంట్లను తీసుకు రావాలని తెలిపారు. 15 రోజులకుపైగా తహసీల్దార్ పోస్టు ఖాళీగా ఉండటంతో కొత్త డీలర్ల ఎంపిక ప్రక్రియను ఇన్‌చార్జ్‌గా ఉన్న డిప్యూటీ తహసీల్దార్ ఆంజనేయ ప్రసాద్‌తో కూటమి నాయకులు చేయిస్తున్నారు. రైస్ గోడౌన్ నుంచి స్టోర్‌లకు ఈ నెల 21 నుంచి సరుకులను రవాణా ప్రారంభించారు. సమయం తక్కువ ఉండడతో కొత్త డీలర్ల హడావుడి ఎక్కువైంది.

డీలర్ల కమీషన్‌కు ధోకా ఉండదు



డీలర్లకు పెండింగ్‌లోని కమీషన్‌కు ఎలాంటి ధోకా ఉండదు. వారికి కమీషన్ వచ్చేటట్లు చేస్తాం. రాజీనామా చేసిన పాత డీలర్ల స్థానంలో మాత్రమే కొత్త వారిని నియమిస్తున్నాం. నిబంధనల మేరకు నియామకాలు జరుగుతాయి. రాజీనామా చేసిన డీలర్ల వద్ద ఉన్న బఫర్ స్టాక్‌పై విచారణ చేస్తున్నాం.

– ఆంజనేయ ప్రసాద్, ఇన్‌చార్జ్ తహసీల్దార్

విద్యార్థులకు జీవనోపాధులు పుష్కలం


మాట్లాడుతున్న డాక్టర్ శోభాబిందు

బుక్కరాయసముద్రం: నైపుణ్యాలు పెంపొందించుకుంటే ఇంజినీరింగ్ విద్యార్థులకు జీవనోపాధులు పుష్కలంగా ఉన్నాయని ఎసినార్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ కో ఫౌండర్, ఆర్‌అండ్‌డీ డైరెక్టర్ మహమ్మద్ దాదా, ఐఈఐ లోకల్ సెంటర్ చైర్మెన్ ప్రొఫెసర్ శోభాబిందు అన్నారు. గురువారం మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్‌ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో ఇన్నోవేషన్ ఆట్ ది ఎడ్జ్ ఏ డీప్ డైవ్ ఇన్ టు ది ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ అండ్ డ్రైవ్స్ అప్లికేషన్స్‌పై నిర్వహించిన రెండు రోజుల వర్క్ షాపు గురువారం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. వర్క్ షాపును కళాశాలలోని ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్, ఐటీలో పరిశోధన, అభివృద్ధిలో కృషి చేస్తున్న అసెన్సర్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ వారు సంయుక్తంగా నిర్వహించారు. వర్క్ షాపులో దేశ వ్యాప్తంగా వివిధ కళాశాలల విద్యార్థులు ఆన్‌లైన్‌లో పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ నేటి టెక్నాలజీ ప్రపంచంలో ఐఓటీ ఎంతో కీలక పాత్ర పోషిస్తోందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బాలక్రిష్ణ, టీపీఏ రంజిత్‌రెడ్డి, డాక్టర్ మారుతీకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించండి


బీకేఎస్‌లో ఆందోళన చేస్తున్న కార్మికులు


కల్లూరులో సమ్మె చేస్తున్న సత్యసాయి కార్మికులు

బుక్కరాయసముద్రం: పెండింగ్ వేతనాలు మంజూరు చేయాలని మండలంలోని సత్యసాయి వాటర్ సరఫరా ప్రాజెక్ట్‌లో పని చేస్తున్న కార్మికులు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని సత్యసాయి వాటర్ సరఫరా ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. కార్మికులు మాట్లాడుతూ సత్యసాయి వాటర్ ప్రాజెక్ట్‌లో జిల్లా వ్యాప్తంగా 532 మంది కార్మికులు ఉన్నారన్నారు. వారికి 6 నెలలుగా వేతనాలు మంజూరు చేయలేదన్నారు. ఈ విషయంపై సీఎం చంద్రబాబు దృష్టికి తీసుపోయినా స్పదించిలేదన్నారు. ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే మంజూరు చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపదతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు రాఘవేంద్రాచారి, దేవదాస్, కిష్టప్ప, నాగరాజు, పెద్దన్న, నల్లప్ప, భాస్కర్‌రెడ్డి, నారాయణవలి, నరేష్, విశ్వనాథ్ నరహరి పాల్గొన్నారు.

కల్లూరులో సత్యసాయి కార్మికులు సమ్మె

గార్లదిన్నె: మండలంలోని కల్లూరులో గురువారం సత్యసాయి కార్మికులు సమ్మె చేశారు. వారు మాట్లాడుతూ గత ఆరు ఆనెలల నుంచి జీతాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులకు సమస్యను విన్నవించుకున్నా ఫలితం లేదన్నారు. అదేవిధంగా బడ్జెట్ కేటాయించకపోవడం, సత్యసాయి వాటర్ స్కీం మూసివేసే చర్యలుగా భావిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సత్యసాయి కార్మికులు బాషా, నాగభూషణ, మల్లరా యుడు తదితరులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి


ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, మహిళలు, జర్నలిస్టులు, జేఏసీ నాయకులు


గేయాలు ఆలపిస్తున్న రామదాసు కళా బృందం సభ్యులు

గుత్తి: కలకత్తాలో ఓ వైద్యురాలిపై జరిగిన అత్యాచారం, హత్యపై ఘటనలపై గుత్తిలో గురువారం ప్రజలు కదం తొక్కారు. జేఏసీ నాయకలు, వర్కింగ్ జర్నలిస్టుల ఆధ్వర్యంలో నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ భారీ నిరసన ర్యాలీ, మానవ హారం నిర్వహించారు. జేఏసీ నాయకులతో పాటు విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాలు, ఆయా రాజకీయ పార్టీల నాయకులు, కుల సంఘాలు, న్యాయవాదులు, వైద్యులు, వైద్య, ఆరోగ్య సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, డ్వాక్రా సంఘాల మహిళలు, ఆర్‌పీలు, ఆశా వర్కర్లు వేలాదిగా తరలివచ్చారు. నిందితులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఏక కంఠంతో వేలాది గొంతులు నినాదాలు చేశారు. జేఏసీ నాయకులు మాట్లాడుతూ కలకత్తాలో జరిగిన ఘటనతో పాటు దేశ వ్యాప్తంగా మహిళలు, చిన్న పిల్లలు, యువతులపై జరిగిన ఘటనలను వివరిస్తూ నిందితులను అరెస్టు చేయడంతో పాటు చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గేట్స్ ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులతో పాటు శ్రీ సాయి జూనియర్ కాలేజీ, శ్రీ సాయి డిగ్రీ కాలేజీ, మహాత్మా జూనియర్ కాలేజీ, ఎంఎస్ డిగ్రీ కాలేజీ విద్యార్థులు, విలేకరులు పాల్గొన్నారు.

గ్రామసభలను విజయవంతం చేయండి


గుంతకల్లులో సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: గ్రామసభలను విజయవంతం చేయాలని ఎంపీడీఓ శ్రీకాంత్ చౌదరి సూచించారు. ఈ నెల 23న మండల వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లోనూ ఉపాధి హామీ గ్రామసభలు నిర్వహిస్తున్న నేపథ్యంలో గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి సిబ్బందికి గ్రామసభల నిర్వహణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏపీఓ కృష్ణమూర్తితో కలిసి ఎంపీడీఓ మాట్లాడారు. సభలకు గ్రామస్తులు, ప్రజా ప్రతినిధులు తప్పనిసరిగా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.

పెద్దవడుగూరు: మండలంలోని 25 పంచాయతీల్లో ఉపాధి పనులపై శుక్రవారం గ్రామ సభలు నిర్వహిస్తామని ఎంపీడీఓ కుళ్లాయిస్వామి, ఏపీఓ పుల్లారెడ్డి గురువారం తెలిపారు. ఉపాధి కూలీలు, రైతులు, ప్రజలు హాజరు కావాలన్నారు.

శింగనమల: వచ్చే ఆర్థిక సంవత్సరానికి ఉపాధి పనుల గుర్తింపు కోసం శుక్రవారం మండలంలోని 19 పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నిర్మలాకుమారి తెలిపారు. ఉపాధి కూలీలు, రైతులు హాజరు కావాలని కోరారు.

యల్లనూరు: అన్ని పంచాయతీల్లో ఉపాధి గ్రామసభలను జయప్రదం చేయాలని ఎంపీడీఓ వీరరాజు సూచించారు. గురువారం ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ శుక్రవారం నిర్వహించే గ్రామసభలను జయప్రదం చేయాలన్నారు. ఏపీఓ షబ్బీర్‌బాషా, ఈసీ బబ్లు, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

వర్షంతో జన జీవనం అస్తవ్యస్తం


ఖాదర్‌పేట వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న పెద్దవంక


కోతకు గురైన తంబళ్లపల్లికి వెళ్లే రహదారి

పామిడి: మూడు రోజులుగా భారీ వర్షాలతో జన జీవనం స్తంభించింది. ఈ మూడురోజులకు గాను సగటున 64 మిల్లీమీటర్ల వర్షపాతంగా నమోదైంది. వర్షాలకు పైప్రాంతాల వరదనీరు తోడవ్వడంతో మండలవ్యాప్తంగా వాగులు, వంకలు, కాలువలు, చెరువులు పొంగిపొర్లాయి. దీంతో పామిడితో పాటు పామిడి స్టేషన్, సొరకాయలపేట, కండ్లపల్లి, రామగిరి ఎగువతండా, ఖాదర్‌పేట, తంబళ్ళపల్లి తదితర గ్రామాల్లో వరదనీరు రోడ్లపై ప్రవహించడంతో పాదచారులు, వాహనచోదకులు ఫీట్లు చేయాల్సి వచ్చింది. నీలూరు నుంచి తంబళ్లపల్లి వెళ్లే దారి పుల్లేటివంక వరదనీటి ఉధృతితో కోతకు గురైంది. దీంతో తంబళ్లపల్లికి, అలాగే ఖాదర్‌పేట వద్ద పెద్దవంక ఉధృతికి ఆయా గ్రామాలకు రాకపోకలు స్తంభించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, విద్యుత్ కార్యాలయం మడుగును తలపించాయి. అనుంపల్లి, రామగిరి, జీ కొట్టాల చెరువులు పొంగిపొర్లాయి. దీంతో పామిడిలోని వంకగడ్డ వీధి, బీసీ కాలనీ, మదీనా కాలనీ, వెంగమనాయుడు కాలనీ, చైతన్యకాలనీ, నెహ్రూకాలనీ తదితర వీధులు ద్వీపకల్పంగా మారాయి. మరిముఖ్యంగా బీసీ కాలనీలోని ఇళ్లలోకి వరదనీటితో పాటు తేళ్లు, పాములు రావడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. పెన్నానది ఉధృతితో పామిడి–కల్లూరు గ్రామాల నడుమ రాకపోకలను బైపాస్‌మీదుగా మళ్లిచారు. ఎక్కడిపడితే అక్కడ కాలువలు, వంకలు ఆక్రమణలతో వరదనీరంతా పట్టణంలోని ఇళ్లలోకి ప్రవేశించింది. పట్టణంలో అస్తవ్యస్తమైన డ్రైనేజీ వల్ల లోతట్టు ప్రాంతాల్లోకి వరదనీరు చేరుతోంది. దీంతో వర్షం వచ్చిందంటే లోతట్టు ప్రాంతాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పామిడి పెన్నానదికి అనుసంధానం చేస్తూ అండర్‌డ్రైనేజీ నిర్మాణ విధానంతో వరదనీటి ఉధృతి నుంచి పామిడిని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

సంక్షిప్త వార్తలు


మామపై అల్లుడి దాడి

తాడిపత్రి అర్బన్: భార్యను కాపురానికి పంపలేదన్న కోపంతో మామపై అల్లుడు దాడి చేసిన ఘటన పట్టణంలో చోటు చేసుకుంది. అర్బన్ సీసీఐ నాగేంద్ర ప్రసాద్ కథనం మేరకు.. గన్నెవారిపల్లి కాలనీకి చెందిన సంబుదాస్ కూతురు మమతను మూడేళ్ల క్రితం యాడికి మండలం నగరూరుకు చెందిన చిరంజీవికి ఇచ్చి వివాహం చేశారు. భర్త అదనపు కటన్నం కోసం వేధిస్తుండడంతోమమత తాడిపత్రిలోని పుట్టినింటికి వచ్చింది. ఈ విషయమై పలు మార్లు పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ కూడా చేశారు. అయితే గురువారం సాయంత్రం సంబుదాస్ నంద్యాల రోడ్డులో ఉండగా అక్కడికి చేరుకున్న అల్లుడు చిరంజీవి తన భార్యను పుట్టినింటికి పంపించాలని వాగ్వాదానికి దిగాడు. ఆయన ఒప్పుకోకపోవడంతో చిరంజీవి తన వెంట తెచ్చుకున్న కొడవలితో దాడి చేశాడు. గాయపడ్డ సంబుదాస్‌ను స్థానికులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ సీఐ తెలిపారు.

కారు బోల్తా

పెద్దపప్పూరు: మండలంలోని చాగల్లు గ్రామ సమీపంలో గురువారం ఓ కారు బోల్తాపడింది. వివరాలు.. ధర్మవరం పట్టణం కేశవనగర్‌కు చెందిన జయక్రిష్ణ, జయలక్ష్మి దంపతులు కారులో పెద్దపప్పూరు మండలం నరసాపురంలో జరిగే ఓ నిశ్చితార్థ వేడుకకు బయలుదేరారు. చాగల్లు వద్ద పశువులు ఎదురుగా రావడంతో తప్పించబోయి కారు బోల్తాపడింది. స్థానికులు వెంటనే వారిని రక్షించారు. వారికి ఎలాంటి గాయాలు కాలేదని ఎస్ఐ గౌస్‌బాషా తెలిపారు.

తేనెటీగల దాడిలో కూలీకి గాయాలు


గాయపడిన మల్లికార్జున

గుత్తి రూరల్: మండలంలోని పూలకుంట గ్రామానికి చెందిన మల్లికార్జున అనే వ్యవసాయ కూలీ గురువారం తేనెటీగల దాడిలో తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. మల్లికార్జున మరి కొందరు కూలీలతో కలసి గ్రామ శివారులోని పంట పొలాల్లో కూలీ పనులకు వెళ్లాడు. సమీపంలోని పెద్ద తేనెటీగలు ఒక్కసారిగా అతడిపై దాడి చేశాయి. మొహం, వీపు, ఛాతీ, చేతులపై గాయాలవడంతో తోటి కూలీలు వెంటనే అతడిని గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు అతడిని అనంతపురానికి తరలించారు.

బాలిక అదృశ్యంపై కేసు

గార్లదిన్నె: మండలంలోని ఇల్లూరుకు చెందిన ఓ బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా గురువారం తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. గ్రామానికి చెందిన శ్రీనివాసులు కుమార్తె భావన(17) తాడిపత్రి సీవీరామన్ కాలేజీలో డిప్లమా ద్వితీయ సంవత్సరం చదువుతోంది. నెల రోజుల నుంచి ఇల్లూరులో ఇంటి వద్దే ఉంటోంది. మంగళవారం ఉదయం తల్లిదండ్రులు వ్యవసాయ పనులకు వెళ్లగా బాలిక ఇంటి నుంచి బయటికి వెళ్లిపోయింది. సాయంత్రం అయినా ఇంటికి రాకపోవడంతో.. చుట్టుపక్కల ప్రాంతాలు, బంధువుల ఊర్లలో వెతికినా బాలిక ఆచూకీ లభ్యం కాలేదు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

క్లుప్తంగా

ముగిసిన ఆరాధనోత్సవాలు


అలంకరణలో రాఘవేంద్రస్వామి బృందావనం

తాడిపత్రి అర్బన్: మూడు రోజుల పాటు నిర్వహించిన రాఘవేంద్రస్వామి 352 ఆరాధనోత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించిన ఉత్తరారాధానతో ఘనంగా ముగిశాయి. వేకువజామునే స్వామికి నిర్మల్య విసర్జన అనంతరం అష్టోత్తర క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం చేశారు. స్వామి బృందావనాన్ని తులసి, ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. స్వామి పాద పూజలు, కనక మహాపూజ, తులసీ అర్చనను వైభవంగా చేశారు. అనంతరం 12గంటలకు స్వామిని ప్రత్యేకంగా అలంకరించిన రథంలో ప్రతిష్ఠించి స్వామి వారి ర థోత్సవాన్ని నిర్వహించారు. స్వామి వారికి మహామంగళారతి ఇచ్చారు. ఈసందర్భంగా నిర్వహించిన వసంతోత్సవం కార్యక్రమంలో భక్తులు రంగులు చల్లుకున్నారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. తిరుపతికి చెందిన నందనందన బృందం నిర్వహించిన కోలాట నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. ఆరాధనోత్సవాల్లో ఆఖరి రోజు కావడంతో ఉత్సవాలకు హాజరైన భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు

యాడికి: మండలంలోని రాయలచెరువు గ్రామంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బెంగళూరుకు చెందిన శంకర్ కంటి ఆస్పత్రి యాజమాన్యం ఉచిత వైద్య శిబిరం నిర్వహించింది. శిబిరంలో మండల వ్యాప్తంగా 176 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా అందులో 47 మందికి కంటి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించామని లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ సూర్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు రవి ప్రసాద్, రవి కుమార్ రెడ్డి, రంజిత్ కుమార్, ఇస్మాయిల్, కలశేఖర్ నాయుడు, జయరామిరెడ్డి, అల్లాబకాష్, మురళీకృష్ణ, రామమోహన్‌రెడ్డి, శేషానందరెడ్డి, ప్రసాద్, వికాష్ స్కూల్ రామకృష్ణ, శంకర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'కృష్ణాష్టమి వేడుకలు జయప్రదం చేయండి

పామిడి: పట్టణంలోని కొత్తబస్టాండ్ వద్ద త్రైత సిద్ధాంతం, ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞానవేదిక పామిడి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే కృష్ణాష్టమి వేడుకలకు సంబంధించిన ఆహ్వానపత్రికలను సీఐ రాజశేఖర్‌రెడ్డి, ఈఓ చంద్రశేఖర్ తదితరులకు గురువారం అందజేశారు. ఈ నెల 26 నుంచి సెప్టెంబర్ 5 వరకూ 11 రోజుల పాటు వేడుకలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఆ కమిటీ సభ్యులు, సూర్యనారాయణ, శివారెడ్డి, చంద్రశేఖర్, నారపరెడ్డి, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా శివరామకృష్ణ



తాడిపత్రి రూరల్: తాడిపత్రి మున్సిపల్ కమిషనర్‌గా శివరామకృష్ణను నియమించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా తాడిపత్రి కమిషనర్‌గా వచ్చిన రామ్మోహన్‌ను విజయవాడ హెడ్ క్వార్టర్‌కు రిపోర్టు చేయాలని ఆదేశించారు. 2014–19 మధ్య తాడిపత్రి మున్సిపల్ కమీషనర్‌గా శివరామకృష్ణ పని చేశారు. అప్పట్లో తాడిపత్రి మున్సిపాలిటీకి అనేక అవార్డులు రావడంలో కృషి చేశారు.

తహసీల్దార్ కార్యాలయంలో సీసీ కెమెరాలు


రికార్డు రూం బయట బిగించిన సీసీ కెమెరా

తాడిపత్రి రూరల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలోని రికార్డు గదికి అధికారులు రెండు సీసీ కెమెరాలను బిగించారు. ఒక కెమెరా రూం బయట బిగించగా లైట్‌తో కూడిన మరో కెమెరాను గదిలోపలి గోడకు అమర్చారు. చిత్తూరు జిల్లా మదనపల్లి ఆర్డీఓ కార్యాలయంలోని రికార్డు రూం ఇటీవల అగ్నికి ఆహుతవడంతో విలువైన రికార్డులు బూడిదయ్యాయి. ఈ సంఘటనను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలోని రెవెన్యూ కార్యాలయాల్లో రికార్డు రూంల భద్రతను దృష్టిలో ఉంచుకుని సీసీ కెమెరాలను బిగించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. తాడిపత్రి తహసీల్దార్ కార్యాలయం నిర్మించి వంద సంవత్సరాలకు పైగా అయింది. బిల్డింగ్ కాల పరిమితి ముగియడంతో భద్రతపై కూడా అధికారులు సమీక్ష నిర్వహించి కలెక్టర్‌కు నివేదిక పంపారు.

సామాజికి తనిఖీపై 27న ప్రజావేదిక

తాడిపత్రి రూరల్: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఈనెల 27న సామాజిక తనిఖీపై ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రంగారావు గురువారం తెలిపారు. మండలంలో 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకూ జరిగిన ఉపాధి పనులు, హౌసింగ్, పశుసంవర్ధక, పంచాయతీ రాజ్, ఫారెస్టు, సెర్ప్ కింద చేపట్టిన పనులపై 17వ విడత సామాజిక తనిఖీ జరుగుతోందన్నారు. 27వ తేదీ నిర్వహించే ప్రజావేదిక కార్యక్రమనాఇకి ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని ఎంపీడీఓ తెలిపారు.

'అనధికార లే అవుట్లలో క్రయ, విక్రయాలు చేయొద్దు'

తాడిపత్రి రూరల్: తాడిపత్రి పట్టణ పరిధిలో అనధికారికంగా వెలసిన అనధికార లే అవుట్లలో ప్లాట్లను ప్రజలు రిజిస్టర్ చేయించుకుంటే, వాటిలో మౌలిక సదుపాయాలను కల్పించబోమని కమిషనర్ రామ్మోహన్ గురువారం తెలిపారు. పట్టణంలోని యల్లనూరు రోడ్డులోని సర్వే నెంబర్ 743–బీలోని 2.02 ఎకరాలు, టీచర్స్ కాలనీలోని సర్వే నెంబర్ 620–బీలోని 1.50 ఎకరాలు, క్రిష్ణాపురం ఎక్స్‌టెన్షన్‌లోని సర్వే నెంబర్ 4.50 ఎకరాల్లోని ప్లాట్లలో క్రయ,విక్రయాలు చేయొద్దన్నారు. అందులో భవన నిర్మాణాలకు అనుమతులిచ్చేది లేదని, మౌలిక సదుపాయాలైన రోడ్లు, మంచి నీటి సౌకర్యం, కాలువలు ఏర్పాటు చేయబోమన్నారు.

ఏటీఎం కేంద్రం ప్రారంభం


ఏటీఎం కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలోని అనంతపురం రోడ్డులో ఉన్న టౌన్ బ్యాంకులో గురువారం ఏటీఎం కేంద్రాన్ని ప్రారంభోత్సవం చేశారు. టౌన్ బ్యాంకు చైర్మన్ అబ్దుల్ జిలాన్, సీఈఓ మహేశ్వర ప్రసాద్, వైస్ చైర్మన్ రామ్మోహన్ కత్తిరించి ఏటీఎం కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా టౌన్ బ్యాంకు చైర్మన్ మాట్లాడుతూ వినియోగదారులు ఏటీఎంను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో బ్యాంకు డైరెక్టర్లు మధు, వెంకటేష్ బాబు, వీరన్న, కృష్ణ, వెంకటేష్, మహబూబ్, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రమ్‌ల వితరణ

పామిడి: పట్టణంలోని టీసీ హైస్కూల్‌లో ఎన్‌సీసీ విద్యార్థులకు మార్చిగ్ డ్రమ్‌లను గురువారం ఆ స్కూల్ ఉపాధ్యాయురాలు క్రీస్తువాణి వితరణగా ఇచ్చారు. రూ.10 వేలు విలువ చేసే డ్రమ్‌లను ఆమె హెచ్ఎం కె.రామ్‌కుమార్, ఎన్‌సీసీ యూనిట్ అధికారి వై.రామాంజనేయులు సమక్షంలో విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలికి ఎన్‌సీసీ విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

రైతు సమస్యలపై పోరాటం

శింగనమల: రైతుల సమస్యలపై పోరాటం చేస్తామని మండల రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, కొండారెడ్డి అన్నారు. గురువారం శింగనమలలో మండల రైతు సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అన్నదాతలకు రైతు భరోసా రూ.20 వేలు అందజేయాలన్నారు. మండలంలో రైతుల సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తామన్నారు. సీపీఎం మండల కార్యదర్శి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాజలాల విడుదల


పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

యల్లనూరు: వైఎస్సార్ జిల్లా గండికోట రిజర్వాయర్ నుంచి విడుదలైన కృష్ణాజలాలను గురువారం శింగనమల ఎమ్మెల్యే శ్రావణిశ్రీ కోడిమూర్తి పంప్‌హౌస్ వద్ద ప్రత్యేక పూజలు చేసి బటన్ ఆన్ చేసి 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. మొదటగా కోడిమూర్తి పంప్‌హౌస్ నుంచి గడ్డంవారిపల్లి చెరువుకు నీటిని మోటార్ల సాయంతో పంపింగ్ చేశారు. గడ్డంవారిపల్లి చెరువుకు నీరు రావడంతో ఎండుతున్న పంటలు కాస్త ఉపశమనం లభించిందని రైతులు అంటున్నారు. అలాగే బోరుబావుల్లో భూగర్భ జలాలు పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఈఈ కృష్ణారెడ్డి, ఏఈ వేణుగోపాల్ , తెదేపా నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.